శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోథ్ : శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్

బోథ్, మార్చి 12 : బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు శనగ మద్దతు ధర రూ.5440 విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాణి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కోల రాజేశ్వర్, డైరెక్టర్లు రాజుయాదవ్, మనోహర్, జిట్టా శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ వసంత్‌రావ్, తాహర్ బిన్ సలాం, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించొద్దు

తాంసి, మార్చి 12: రైతులు శనగ పంటను ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి మోసపోవద్దని పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ సీఈవో కేశవ్, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

తాంసి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ్

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

తాంసి, మార్చి 12: విద్యార్థులు ఇష్టపడి చదివి పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచించారు. కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, సామగ్రి అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ జోలికి వెళ్లొద్దని సూచించారు. చదువుపైనే ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఫణిందర్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి-సంతోష్, ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌రావ్, మాజీ సర్పంచ్ సదానందం, మహేందర్, ఉపాధ్యాయులు విలాస్ గౌడ్, డ్రాయింగ్ మాస్టర్ సురేందర్ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను సంరక్షించాలి

ఉట్నూర్(రూరల్), మార్చి 12: గోండి భాషతో పాటు సంస్కృతీసంప్రదాయాల రక్షణకు సహకరించాలని రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషం రావు ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాను కోరారు. ఉట్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్ పీఎమ్మార్సీ కార్యాలయంలో అన్ని తెగలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. పీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. తప్పకుండా గోండిభాషతో పాటు సంస్కృతీసంప్రదాయల రక్షణకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐటీడీఏ ఈఈ భీంరావ్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావ్, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడీ మెస్రం దుర్గుపటేల్, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గోడం గణేశ్, జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, తోటి సంఘం మాజీ అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి, నాయక్‌పోడు, పర్ధాన్ సంఘం నాయకులు ఉన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12 : ఆదిలాబాద్‌లోని సంజయ్‌నగర్ కాలనీలో రామకృష్ణ మార్క్‌లోని ధ్యాన మందిరంలో మంగళవారం రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. రామకృష్ణ పరమహంస చేసిన బోధనలు, శాంతి ధర్మ సంస్థాపనకు నిలయంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఆరె భూమన్న, కోరెటి లెనిన్, లక్ష్మయ్య, బండారి సతీశ్ పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12 : ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టీ) గ్రామంలోని మైనార్టీ పాఠశాలలో మంగళవారం షీటీం విధులు, సైబర్ క్రైం నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యురాలు సుశీల మాట్లాడుతూ ఎవరైనా పోకిరీలు యువతులపై అసభ్యంగా ప్రవర్తించిన, ఇబ్బందులకు గురి చేసిన, వెంటబడి వేధించిన షీటీం 8712659953 నంబర్‌ను సంప్రదించాలన్నారు. బాల్య వివాహం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆసిఫ్, షీటీం సభ్యులు సత్యమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

బోథ్ : మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

బోథ్, మార్చి 12 : వేసవి కాలం ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నీటి సరఫరా పైప్‌లైన్లలో ఎక్కడైనా లీకేజీలుంటే మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, ఎంపీవో మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నివేదికను తయారు చేయాలి

ఇచ్చోడ, మార్చి 12 : మండలంలోని ఏ గ్రామాల్లో నీటి సమస్య ఉందో నివారణకు నివేదిక తయారు చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ జైపాల్, ఎంపీవో సాయిప్రసాద్, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

కుంటుపడుతున్న అభివృద్ధి

- గ్రామాల్లో పనులకు ఆటంకం
- జాయింట్ చెక్ పవర్‌తోనే మేలు

నార్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నార్నూర్, మార్చి 12 : గ్రామ పాలనలో కీలకం గ్రామ పంచాయతీలే. సర్పంచ్‌ల పాలన ఈ ఏడాది జనవరి నెలలో ముగిసిన విషయం తెలిసిందే. పంచాయతీలకు ఎన్నికలపై ఎలాంటి ప్రకటన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి రెండో తేదీ నుంచి ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగిస్తోంది. పంచాయతీల్లో అభివృద్ధి, ఇతర కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రతి నెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే 15 ఫైనాన్స్ కింద ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ నిధులు కేటాయిస్తున్నాయి. వీటిని గతంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు వారి చెక్‌పవర్ ద్వారా అవసరం బట్టి వినియోగించుకునే వారు. ప్రస్తుతం ఆ చెక్ పవర్‌ను ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. పీఎఫ్ఎంఎస్ నిధులకు సంబంధించి డిజిటల్ కీ కూడా నేటికి ఇవ్వలేదు.

ఒక్కో పంచాయతీల్లో...

నార్నూర్, గాదిగూడ మండలాల్లో 48 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రతి రోజూ ట్రాక్టర్‌లో డీజిల్ పోయించాల్సి ఉంటుంది. అలాగే పారిశుధ్యం కోసం బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ మోటర్ల మరమ్మతు, వీధి దీపాల ఏర్పాటు పనులను సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు కార్యదర్శులు వాపోతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో ఇప్పటికే రూ. 50వేలకు పైగా ఖర్చు చేసినట్లు అధికారులు అంటున్నారు. గత నెలలో 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు విజయవంతంగా పూర్తి చేశారు. మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్, పంచాయతీ కార్యదర్శులకు గత నెలకు సంబంధించి వేతనాలు మంజూరు కాలేదు. అభివృద్ధి పనులకు అప్పు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు చెబుతున్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లు, ట్రాక్టర్‌కు నెల వారీ రుణాలు, మల్టీపర్పస్ వర్కర్లకు తప్పనిసరి. ప్రభుత్వం ఇవి తర్వగా చెల్లించకుంటే పరిస్థితులు దారుణంగా ఉంటాయని మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు అంటున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు డిజిటల్ కీ రిజిస్ట్రేషన్ త్వరగా ఇవ్వాలని నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారం

గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ చెక్‌పవర్ ఇవ్వడం జరిగింది. ఇప్పటికే ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. డిజిటల్ కీ రిజిస్ట్రేషన్ త్వరలోనే అయిపోతోంది. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో చెక్ పవర్ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు యథావిధిగా నిర్వహించేలా చూస్తాం.

-ఆనంద్, ఎంపీవో, నార్నూర్

ఫ్రెండ్స్ క్లబ్ భవన నిర్మాణానికి భూమి పూజ

భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సంధ్యారాణి

బోథ్, మార్చి 12 : మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ మైదానంలో భవన నిర్మాణానికి మంగళవారం జడ్పీటీసీ సంధ్యారాణి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి రూ. 10లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాహెర్ బిన్ సలాం, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నారాయణ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజు, ఫ్రెండ్స్ క్లబ్ ప్రధానకార్యదర్శి రమేశ్ బాబు, సభ్యులు ప్రసాద్,కిషన్, రవీందర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలతో ఉజ్వల భవిష్యత్

క్రీడలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్

ఉట్నూర్, మార్చి 12 : గిరిజన క్రీడా పాఠశాలతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉత్తమ సాధన, నిరంతర పర్యవేక్షణతో క్రీడా పాఠశాలలో శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ పోటీలో జిల్లా వ్యాప్తంగా 182 మంది బాలురు, 102 మంది బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాల అధికారులు హేమంత్, లక్ష్మణ్, గోపాల్, శ్రీనివాస్, రవీందర్, ప్రతాప్‌సింగ్, జైవంత్‌రావ్, కోచ్‌లు సునంద్, శివకృష్ణ, శేఖర్, మనోజ్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12: మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ మండలం సిరికొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ మహిళా సాధికారత, గృహహింస చట్టం గురించి వివరించారు. గర్భిణులు, పిల్లలు ఆకుకూరలు, పండ్లు, పాలు, పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిల్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, మహిళలు, గర్భిణులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి

బోథ్, మార్చి 12: కోట(కే) గ్రామానికి చెందిన కేంద్రె విఠల్ (66) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విఠల్ తన ఇంట్లో ఫ్యాన్ వేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంట్లో ఉన్న తల్లి యశోదబాయి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఇచ్చోడ, మార్చి 12 : గర్భిణులు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని మాజీ సర్పంచ్ అరుంధతి అన్నారు. మంగళవారం పోషణ పక్షం వారోత్సవాల్లో భాగంగా బోరిగామ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇంగ్లిష్ బోధించాలన్నారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఇంద్రవెల్లి, మార్చి 12: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని వాహనదారులకు ఎస్ఐ సునీల్ హెచ్చరించారు. మండలంలో ఇటీవల కాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మంది వాహనదారులపై కేసు నమోదు చేసి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. అనంతరం ఉట్నూర్ కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. పోలీసుల విధించే నిబంధనలను ఉల్లంఘించిన నలుగురిపై ఈ-పీటీ కేసు నమోదు చేసి 200ల చొప్పున ఫైన్ విధించినట్లు పేర్కొన్నారు.

ఐదుగురికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

ఎదులాపురం, మార్చి 12 : వరకట్న హత్య నేరానికి సంబంధించి కేసులో ఐదుగురికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష ఒక్కొక్కరికి రూ.19వేలు జరిమానా విధిస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ తీర్పు వెలువరించినట్లు జిల్లా కోర్టు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. నిర్మల్ జిల్లా జయరాంనాయక్ తండా పరిమండల్ గ్రామానికి చెందిన స్వప్నను కాంత్రిగ్రావ్ గ్రామం బోథ్ మండలానికి చెందిన రాథోడ్ జైవంత్‌రావ్‌కు రూ.3లక్షలు వరకట్నం, తులం బంగారం, ఒక మోటార్‌సైకిల్ కోసం రూ.60వేలు ఇచ్చి 18 ఏప్రిల్ 2018న పెళ్లి జరిపించారు. పెండ్లి అయిన 15 రోజుల తర్వాత స్వప్న భర్త రాథోడ్ జైవంతరావ్, అత్తమామలు రాథోడ్ దావిత్రిబాయి ,రాథోడ్ సోమ్ల, బావలు రాథోడ్ శివరాం, రాథోడ్ ఆత్మారం స్వప్నను రూ.లక్ష అదనపు కట్నం తీసుకురావాలని వేధించారు ఈ విషయంలో కులపెద్దల సమక్షంలో పంచాయితీలు జరిపి స్వప్న భర్తకు కుటుంబ సభ్యులకు, త్వరలోనే అదనపు కట్నం రూ.లక్ష ఇస్తామని చెప్పి స్వప్నను కాపురానికి పంపించారు. 11 ఆగస్టు 2018 సాయంత్రం 4.30 గంటలకు పురుగుల మందు తాగి అత్తవారింటిలో పెండ్లి అయిన నాలుగు నెలల వ్యవధిలోనే ఆత్మహత్య చేసుకుంది. ఆమెను అప్పటికప్పుడు పక్క ఇంటి వారు ప్రభుత్వ దవాఖాన బోథ్‌కు తీసుకెళ్లినప్పటికి డాక్టర్ పరిశీలించి చనిపోయిందని నిర్ధారించారు. ఈ విషయంలో స్వప్న తల్లి జాదవ్ జైవంత్‌బాయి ఫిర్యాదు మేరకు బోథ్ ఎస్ఐ బాకీ కేసు నమోదు చేశారు. విచారణ చేసి కేసును డీఎస్పీ నర్సింహారెడ్డికి అప్పగించారు 24 మంది సాక్షులను కోర్టులో పీపీ సంజయ్‌కుమార్ వైరాగ్రే విచారణ చేపట్టారు. నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ తీర్పు వెలువరించారు.

ఏపీడీకి పోడు రైతుల వినతి

ఏపీడీకి వినతిపత్రం ఇస్తున్న కొలాం గిరిజన రైతులు

భీంపూర్, మార్చి13: తమ పోడు పట్టా భూములలో ఈజీఎస్ పనులు చేపడితే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని మంగళవారం భీంపూర్‌లో గిరిజన రైతులు డీఆర్‌డీఏ ఏపీడీ కుటుంబరావ్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డిలకు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయంలో న్యాయం జరిగేలా చూస్తామని ఏపీడీ హామీ ఇచ్చారు. పోడు రైతులతో ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం ప్రతినిధులు దిలీప్, టేకం జంగు, తదితరులు ఉన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి చేయాలి

ఇచ్చోడ, మార్చి 12 : కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని మజీద్ గల్లీలో కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు ఉద్యమం -2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెనింగ్ (ఎల్‌సీడీసీ)లో 39 టీమ్స్ 12 మంది సూపర్‌వైజర్లు పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాజుబాయి, ఏఎన్ఎం సుధ, సహాయకుడు రాజ్ కిరణ్, ఆశ కార్యకర్తలు సునీత, లక్ష్మి, ప్రియాంక పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాదిగ జేఏసీ నాయకులు

కలెక్టర్‌కు అంబేద్కర్ చిత్రపటం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం, మార్చి 12 : ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షాను మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదిగ జేఏసీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అంబేద్కర్ చిత్రపటం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బారిక్‌రావ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాందాస్, జిల్లా కోశాధికారి ప్రసన్నకుమార్, గంగాధర్, భూమన్న ఉన్నారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఎదులాపురం, మార్చి 12 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన ఎస్సీ అభ్యర్థులకు 5 ఏప్రిల్ నుంచి జూన్ 14వ తేదీ వరకు రెండు నెలల పాటు ఉపాధ్యాయ నియామకాల డీఎస్సీకి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కల్పిస్తున్నట్లు డీఎస్సీడీవో భగత్ సునీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు డైట్, బీఈడీలో ఉత్తీర్ణత కలిగి ఉండి, టెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు https.//tsstudycircle.co.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్, సెల్ నంబర్ 9494149416ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, మార్చి 12 : హైదరాబాద్‌లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌పై ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీబీసీడీవో రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా రెండు నెలల పాటు నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ 26 సంవత్సరాలు కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ నెల15 నుంచి 25వ తేదీ వరకు www.tsbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. ఈ నెల 31తేదీన స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. టెస్ట్‌లో వచ్చి మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులకు ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఇతర వివరాలకు 0879-2221280 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్టడీ మెటీరియల్..

డీఎస్సీ, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 సంబంధించిన స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు డీబీసీడీవో కే రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులు ఈ నెల14 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు www. tsbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలి

బోథ్, మార్చి 12: రైతులు ప్రతి సంవత్సరం ఒకే పంట వేయకుండా పంట మార్పిడిపై దృష్టి సారించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్, వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ పంట సమస్యను నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకోవచ్చన్నారు. రైతులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్టికల్చర్ ఆఫీసర్ మహేశ్, ఆయిల్ ఫాం మేనేజర్ రాంమోహన్‌రావ్, వ్యవసాయ విస్తరణాధికారులు కృష్ణ, శ్యాంసుందర్ రెడ్డి, శ్యాం, హర్ష, రైతులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

ధనుష్ నర్సింహ బండారి హర్షిత్

బోథ్, మార్చి 12 : మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో జనవరి 27వ తేదీన నిర్వహించిన 31వ సీవీ రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ టెస్ట్‌లో నాగభూషణం పాఠశాలకు చెందిన 3వ తరగతి చదువుతున్న బండారి హర్షిత్ జిలా స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందాడు. అలాగే వేదం పాఠశాలకు చెందిన 4వ తరగతికి చెందిన ధనుష్, 7వ తరగతి చెందిన నర్సింహ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో గెలుపొందారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుషాక్‌తో ఆవు మృతి

నార్నూర్, మార్చి 12 : మేతకు వెళ్లిన ఆవు కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన ఘటన నార్నూర్ మండలం ఉమ్రి గ్రామంలో జరిగింది. ఉమ్రి గ్రామానికి చెందిన జాదవ్ హరిలాల్ మంగళవారం ఉదయం మేత కోసం ఆవును వదిలేశాడు. గ్రామ సమీపంలోని పోలంలో మేతమేస్తూ విద్యుత్ స్తంభం వైపునకు వెళ్లింది. అక్కడే పడి ఉన్న విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిందని బాధితుడు తెలిపారు. దీని విలువ సుమారు రూ.15వేల వరకు ఉంటుందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

నార్నూర్, మార్చి 12 : జాబ్‌కార్డు కలిగిన కూలీలకు పని కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ జాదవ్ కైలాస్ అన్నారు. మంగళవారం గుండాల గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల కొలతలు తీసుకున్నారు. ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ శేషారావ్ ఉన్నారు.

503 మంది విద్యార్థులు గైర్హాజరు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 12 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ (ఫిజిక్స్, ఎకనామిక్స్) వార్షిక పరీక్ష ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఇంటర్మీ